ఆధ్యాత్మికం

అలరించిన అఖండ భజన



భజన ప్రారంభిస్తున్న గురుస్వామి

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ అభినవ శబరిమలై శ్రీ అయ్యప్ప ఆలయంలో అయ్యప్పదీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'నీ గానమే నా ప్రాణం' అఖండ భజన కార్యక్రమం ఎంతగానో అలరించింది. అఖండ భజన కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ఉత్తరా నక్షత్ర పూజ, స్వామివారికి పంచామృతాభిశేకం, కాషాయ ధ్వజారోహణం, గోపూజ కార్యక్రమాల అనంతరం అఖండ జ్యోతిని వెలిగించి అఖండ భజనను ప్రచార సమితి జాతీయ అధ్యక్షులు రాజుదేశ్ పాండే, రాష్ట్రఉపాధ్యక్షులు చక్రవర్తులు పురుషోత్తమాచార్యులు ప్రారంభించారు. గురుస్వాములు కేశవ రావు, దిలీప్, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే సుమన్, కరీంనగర్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల, పెద్దపల్లి వివిధ జిల్లాల నుంచి భజన బృందాల సభ్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

శివాలయంలో శ్రావణ శోభ

చెన్నూర్: పట్టణంలోని శివాలయంలో శ్రావణ మాస శోభ సంతరించుకుంది. శ్రావణ మాసంలో తొలి శనివారం కావడంతో భక్తులు అర్చనలు, అభిషేకాలు చేశారు. శ్రావణమాసం శివుడికి అంత్యంత ప్రీతికారమైన మాసం కావడంతో భక్తులు శనివారం అర్చకులు వేమారం మహేశ్వర్‌శర్మ, హిమకర్‌శర్మల నేతృత్వంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక గర్మిళ్ల ఆంజనేయ స్వామి ఆలయంలో ఐదోసారి కూడా ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రజల ఆశీస్సులతో మళ్లీ గెలవాలంటూ శనివారం బీఆర్‌ఎస్ నాయకుడు గొంగ్లళ్ల శంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు గొంగుల శంకర్, జగ్గరి సంజీవ్, నరేండ్ల శ్రీనివాస్, గోపి, బల్లవ్ పాల్గొన్నారు.

సత్యదేవున్ని దర్శించుకున్న అదనపు కలెక్టర్



దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ సత్య నారాయణస్వామిని మంచిర్యాల అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాహుల్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శిఖర కళశ, ధ్వజ, గరుడమూర్తుల నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పూజారులు శ్రీధరాచార్యులు, రామానందాచార్యులు, గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.60
పచ్చిమిర్చి	60
చిక్కుడు కాయ	60
బీరకాయ	60
వంకాయ	50
కాకరకాయ	60
బెండకాయ	40
అలసంద	40
దొండకాయ	80
సోరకాయ	30
ఆకుగోబి	50
పూగోబి	70
గోరుచిక్కుడు	60
పాలకూర	30
తోటకూర	30
ములక్కాయ	80

- మంచిర్యాలఅగ్రికల్చర్



భవిత.. భరోసా

- దివ్యాంగులకు బాసటగా 'భవిత' కేంద్రాలు
- చదువుతో పాటు, వైకల్యంలో మార్పునకు కృషి
- బడికి వెళ్లలేని వారికి ఇంటివద్దే విద్య



మానసిక దివ్యాంగుడి ఐక్యూను పరీక్షిస్తున్న ఉపాధ్యాయుడు

దండేపల్లి: మానసిక, శారీరక వైకల్యం గల దివ్యాంగులకు భవిత కేంద్రాలు ఎంతో బాసటగా నిలుస్తున్నాయి. దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల్లో వారికి చదవడం, రాయడంతో పాటు, వైకల్యంలో మార్పు తీసుకొచ్చేలా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో 18భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 3సంవత్సరాల వయస్సు నుంచి 18 ఏళ్ల లోపు వారిని చేర్పించవచ్చు. 21రకాల దివ్యాంగులు ఇందులో చేరేందుకు అవకాశం ఉంది.

చదవడం రాయడం నేర్పుతూ..

భవిత కేంద్రం ప్రత్యేకంగా దివ్యాంగుల కోసం ఏర్పాటు చేయబడింది. దీంట్లో చేరిన దివ్యాంగులకు ఆట, పాటల ద్వారా, వారికి సులభతరంగా అర్థమయ్యేలా చదవడం, రాయడం నేర్పించడంతో పాటు, శారీరక వైకల్యం గల వారికి వైకల్య మార్పులు తీసుకొచ్చేందుకు, ఫిజియోథెరపీ, మాటలు రాని వారికి స్పీచ్ థెరపీ చేపిస్తూ, ప్రాథమిక స్థాయి వరకు ప్రత్యేక సంసిద్ధత కార్యక్రమాల ద్వారా వారిని అన్ని విధాల తీర్చిదిద్దుతున్నారు. దీంతో వారి వయస్సుకు తగ్గట్టు సమీపంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తారు. అంతేకాకుండా ప్రభుత్వ పరంగా దివ్యాంగులకు అందించాల్సిన బెనిఫిట్స్‌ను కూడా అందేలా చేస్తారు. అందులకు బ్రెయిలీ లిపి ద్వారా అక్షరాలు నేర్పిస్తూ, చదివిస్తారు. అందులకు ప్రాథమిక స్థాయి వరకు ఇక్కడే చదువు నేర్పి, 6వ తరగతి నుంచి పై తరగతులు చదివే వారిని కరీంనగర్ లోని బదిరుల పాఠశాలలో చేర్పిస్తారు.

ఇంటివద్దే విద్యా..

బడికి రాకుండా ఇంటికి పరిమితమైన దివ్యాంగులు భవిత కేంద్రంలో అడ్మిషన్ పొందితే వారికి వారంలో ఒక రోజు, ఉపాధ్యాయుడు ఇంటికి వెళ్లి ఇంటివద్దనే చదువు నేర్పిస్తాడు. చదవడం రాయడంతో పాటు వైకల్య మార్పు కోసం ప్రత్యేక వ్యాయామాలు చేపించడంతో పాటు, తల్లిదండ్రులు కూడా ప్రతిరోజూ పిల్లలకు ఇంటి వద్ద చేపించే వ్యాయామాల గురించి తెలియజేస్తుంటారు.

వెసులుబాటు..

భవిత కేంద్రంలో చదివే వారికి ప్రభుత్వం రవాణ భత్యం చెల్లిస్తుంది. భవిత కేంద్రంలో ప్రాథమిక స్థాయి ముగిసిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలో చేరితే ఎస్కార్ట్ అలవెన్సులు కూడా అందజేస్తుంది. ఉపకార వేతనాలు, అందులకు చేతికర్రలు, చెవిటి వారికి వినికిడి యంత్రాలు, నడవలేని వారికి వీల్‌చైర్స్, మానసిక దివ్యాంగులకు, టీఎల్ఎం కిట్స్ అందిస్తారు.

తప్పనిసరిగా మార్పు వస్తుంది..



భవిత కేంద్రంలో చేర్పించిన దివ్యాంగులకు వారికి ఎలాంటి శిక్షణ ఇస్తే వారిలో మార్పు వస్తుందనే దానిని ముందే గుర్తించి, వారికి తగ్గట్టుగా తగిన శిక్షణ ఇస్తూ, రాయడం, చదవడం నేర్పిస్తాం. వారికి ఈజీగా అర్థమయ్యేలా, బొమ్మలతో, ఆటలతో, పాటలతో చదివిస్తాం. దీంతో దివ్యాంగుల్లో కొంత మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం.

- వెంకటేశ్వర్‌రావు, ఐఈఆర్టీ, భవిత కేంద్రం దండేపల్లి



నడవలేని విద్యార్థికి ఇంటి వద్దే చదువు నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు

సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగ పిల్లలు ఉన్న తల్లిదండ్రులు భవిత కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి. పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలి. ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు భవిత కేంద్రాల్లో విద్యాబోధన చేస్తారు. దివ్యాంగులకు చదువు నేర్పించడంతో పాటు వైకల్యంలో మార్పు తెచ్చేందుకు కృషి చేస్తుంటారు.

- రవీందర్, మండల విద్యాధికారి, దండేపల్లి

'పూస్కూరి రామ్మోహన్‌రావుకే టికెట్ ఇవ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గానికి సంబంధించిన అసెంబ్లీ టికెట్‌ను దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ప్రముఖ సినీ నిర్మాత పూస్కూరి రామ్మోహన్‌రావుకు ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని రామ్మోహన్‌రావు నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, సిరిపురం రాజేశం, రాచకొండ వెంకటేశ్వర్‌రావు(బుజ్జన్న), సింగతి మురళి, బెల్లంకొండ మురళీధర్ మాట్లాడారు. మంచిర్యాల నియోజకవర్గంలోని ప్రజలతో, వివిధ స్థాయిలలో నాయకులతో పరిచయాలు ఉన్న సౌమ్యుడిగా గుర్తింపు పొందారని, విద్యావేత్త అయిన రామ్మోహన్‌రావుకే టికెట్‌ను ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకోలేదని, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బీఆర్‌ఎస్‌లోకి వచ్చి ఎమ్మెల్యేగా నాలుగు పర్యాయాలు పనిచేసినా, నియోజకవర్గంలో ఆశించినంత అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. మెడికల్ కాలేజీ, మాతా శిశు ఆరోగ్య కేంద్రం వంటి ప్రజలకు చేరువలో ఉండాల్సిన వాటిని ప్రజలకు అందుబాటులో లేకుండా దూరంగా ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పూస్కూరి శిల్ప, బియ్యాల తిరుపతి, బొడ్డు శంకర్, బొడ్డు తిరుపతి, తిరుమల యాదవ్, సాగె సుమోహన్, తోట సుధాకర్, బలిజెపల్లి సత్యనారాయణ, గోనె సంజయ్‌రావు పాల్గొన్నారు.

సమాచారం

ఐటీఐలో సీట్ల భర్తీకి ఆహ్వానం

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్‌లో గల ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 19నుంచి 30వరకు మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని పేర్కొన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి

నస్పూర్: తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అనంతరం సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పద్మ, సదానందం, నాగరాజు, బాపు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

భీమిని: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్ డిమాండ్ చేశారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం తపస్ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 21న హైదరాబాద్‌లో చేపట్టే కార్యక్రమానికి అధికసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తపస్ కన్నెపల్లి మండల అధ్యక్షులు శ్రీరామరావు, నాయకులు తిరుపతి, సతీష్, కార్తీక్, రజిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



నస్పూర్: పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో ఆదివారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామ్మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాలలోని 33కేవీ లైన్ వర్క్ చేయడంతో 33కేవీ నస్పూర్ ఫీడర్‌కు అంతరాయం ఉంటుందని, దీంతో పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడునని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నియామకం

బీజేపీ జిల్లా కార్యదర్శిగా రఘునందన్‌రెడ్డి



నియామకపు పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు

చెన్నూర్: మండలంలోని సోమన్‌పల్లి గ్రామానికి చెందిన తుమ్మల రఘునందన్‌రెడ్డిని బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమించిట్లు జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం రఘునందన్‌రెడ్డికి నియామకపు పత్రం అందజేశారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా చంద్రమోహన్‌గౌడ్



నియామకపత్రం అందుకుంటున్న చంద్రమోహన్

పాతమంచిర్యాల: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో నియామకపత్రాన్ని చంద్రమోహన్‌గౌడ్‌కు అందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కలువచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై దృష్టిపెట్టాలి



బహుమతులు ఇస్తున్న ప్రధానోపాధ్యాయులు

జైపూర్: పిల్లల చదువును తల్లిదండ్రులు ఎప్పుడూ గమనిస్తుండాలని, పాఠశాలకు సక్రమంగా విద్యార్థులు వచ్చేలా చూడాలని జైపూర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అలీస్ మాధుర్య తెలిపారు. జైపూర్ హైస్కూల్లో ప్రతి శనివారం నిర్వహించే వినూత్న కార్యక్రమంలో భాగంగా శనివారం తల్లిదండ్రుల సమావేశం, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల ముందే పిల్లలతో పాఠ్యాంశాలు చదివించారు. విద్యార్థుల హాజరు, క్రమశిక్షణ తదితర విషయాలపై తీర్మానాలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన చీరలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ భీమిని రాజయ్య, సర్పంచ్ ఆసంపల్లి సువర్ణ, ఎంపీటీసీ రామటెంకి లింగస్వామి, బాలిక వసతి గృహం వార్డెన్ సుధారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

5కే రన్ సక్సెస్



5కే రన్‌ను ప్రారంభిస్తున్న ఈఆర్వో దత్తు

చెన్నూర్: పట్టణంలో 'ఐ ఓట్ ఫర్ సూర్' అనే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 5కే రన్ సక్సెస్ అయ్యిందని నియోజకవర్గ ఎన్నికల అధికారి సిడాం దత్తు అన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణం వద్ద శనివారం 5కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు చెన్నూర్ నియోజకవర్గ స్థాయి 5కే రన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గోవింద్ నాయక్, ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ పీఈటీ కారెంగుల రామయ్య, వాకర్స్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ముగిసిన పాదయాత్ర

కాసిపేట: కేసీఆర్ పాలనలో సామాన్య ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, సర్పంచ్ వేముల కృష్ణ విమర్శించారు. మండలంలో 'పల్లెపల్లెకు కాంగ్రెస్ పార్టీ' పాదయాత్ర పూర్తయిన సందర్భంగా శనివారం పెద్దనపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు రోజుల్లో 50కిలో మీటర్లు, 50గ్రామాల్లో పర్యటించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నట్లు, కాంగ్రెస్ పార్టీ గెలుపుతోనే సమస్యలు పరిష్కారం సాధ్యమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ

పాతమంచిర్యాల: వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

ఎఫ్‌సీఐని సందర్శించిన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలోని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)ని శనివారం స్థానిక మిమ్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు సందర్శించారు. ఎఫ్‌సీఐ డిపో మేనేజర్ రామారావు హతావత్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ధాన్యం సేకరణ విధానం, శాస్త్రీయ పద్ధతిన భద్రపరిచే విధానం, ఆహార ధాన్యాల పోషణీకరణ, ఆహార భద్రతకు తీసుకుంటున్న చర్యలపై వివరించారు.

ప్రొసీడింగ్‌లు అందజేత

కోటపల్లి: చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా ఫిషరీస్ కార్యాలయంలో కోటపల్లి మండలంలో చేపల పెంపకం దారులకు శనివారం ఎంపీపీ మంత్రి సురేఖ, రామయ్య ప్రొసీడింగ్‌లు ఇప్పించారు.

రెయిన్‌కోట్లు పంపిణీ

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, తాగునీరు సరఫరా చేసే కార్మికులతో పాటు, ఇతర శాఖల్లోని వారికి శనివారం మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ రెయిన్ కోట్లను పంపిణీ చేశారు.

'గిరిజన మహిళను చిత్రహింసలకు గురిచేయడం సరికాదు'

జన్నారం: హైదరాబాద్ ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గిరిజన మహిళ లక్ష్మీబాయిని పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి, తీవ్ర చిత్రహింసలకు గురిచేయడం సరికాదని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నందు పేర్కొన్నాడు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. మండల కేంద్రంలో పార్టీ ఎస్టీ సెల్ నాయకులతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. మహిళకు న్యాయం చేయాలని, ఆమె కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రూ.25లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ధర్మ, రవినాయక్, కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం, ఆరోగ్యమే ముఖ్యం



కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

జైపూర్: బొగ్గు ఉత్పత్తితో పాటు కార్మికులు సంక్షేమం, ఆరోగ్యంపై సంస్థ ప్రధానంగా దృష్టి సారించిందని, కార్మికులు వారి ఆరోగ్యపై జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం చాలా ఉందని ఐకే1ఏ, ఐకే-ఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గని, ఐకే-ఓసీపీపై శనివారం ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి లోకనాథ్‌రెడ్డి నేతృత్వంలో సుమారు 500మంది ఉద్యోగులకు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వోఎం రవికుమార్, ఐకే1ఏ, ఐకే-ఓసీపీ మేనేజర్లు బ్రహ్మాజీరావు, నాగన్న, వెల్ఫేర్ అధికారి రమేశ్, పిట్‌కార్యదర్శులు గడ్డం మలన్న, రత్నాకర్ రెడ్డి, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

'కార్మికుల సంక్షేమం కోసమే టీబీజీకేఎస్'

కాసిపేట: సింగరేణి కార్మికుల సంక్షేమానికి టీబీజీకేఎస్ పనిచేస్తుందని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. బదిలీ వర్కర్లు అపాయింట్ అయి 190/240మస్టర్లు నిండిన ప్రతి కార్మికుడిని జనరల్ మజ్దూర్‌గా రెగ్యూలరైజ్ చేస్తున్నట్లు తెలిపారు. టీబీజీకేఎస్ ముఖ్య నాయకులు యాజమాన్యాన్ని కోరిన వెంటనే, 2022లో అపాయింట్ అయిన కార్మికులకు రెగ్యూలర్ చేస్తూ సర్క్యూలర్ జారి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్‌లో పలువురు కార్మికులు చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికల సంపత్, రీజినల్ సెక్రెటరీ రాజశేఖర్, గని పిట్ కార్యదర్శి తిరుపతి, మైనింగ్‌స్టాఫ్ ఇన్‌చార్జి పెండ్రి రాజిరెడ్డి, ఏరియా కార్యదర్శి శంకర్ రావు, వోడ్నాల రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

'బహుమతులు ఉద్యోగులలో ఉత్సాహం నింపుతాయి'

నస్పూర్: వృత్తిలో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం ద్వారా, ఉద్యోగులలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపుతాయని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఆర్‌కే 8డిస్పెన్సరీలో జూన్ నెలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన డిస్పెన్సరీ ఉద్యోగులు విజయ, మానసలకు శనివారం బహుమతులు అందజేశారు.

'అన్ని దానాలలో రక్తదానం గొప్పది'

నస్పూర్: అన్ని దానాల్లో రక్తదానం చాలా గొప్పదని జీఎం సంజీవరెడ్డి అన్నారు. ఆర్‌కే 8డిస్పెన్సరీలో వృత్తి శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న ఉద్యోగులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం సందర్శించారు. రక్తదానం చేసిన ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందించారు.

బొగ్గుబాయి వార్తలు

బదిలీపై వెళ్తున్న జీఎంకు సన్మానం



మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా నుంచి బదిలీపై కొత్తగూడెం (కార్పొరేట్)కు బదిలీపై వెళ్తున్న జీఎం మోహన్‌రెడ్డిని ఏరియా అధికారులు, సిబ్బంది శనివారం జీఎం ఆఫీస్ ఆవరణలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'జీఎం అక్రమ బదిలీని నిలిపివేయాలి'

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డిని రాజకీయ ఒత్తిళ్లతోనే, మాట వినడం లేదనే అక్కసుతోనే, కొత్తగూడెం కార్పొరేట్‌కు బదిలీ చేశారని ఈ అక్రమ బదిలీని వెంటనే నిలిపివేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. టీఎస్టీయూసీ ఆఫీస్‌లో శనివారం కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. మందమర్రి ఏరియాకు మోహన్‌రెడ్డి బదిలీపై వచ్చి నాలుగున్నర నెలలు అవుతుందని, ఎలాంటి కారణం లేకుండా ఎందుకు బదిలీ చేశారో యాజమాన్యం తెలపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ ఐఎన్టీయూసీ, హెచ్ఎమ్మెస్, బీఎమ్మెస్, సీఐటీయూ, టీఎస్టీయూసీ, జేఏసీ నాయకులు ఉన్నారు.

చెక్కు అందజేత

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తూ చనిపోయిన మార్త రమేష్ కుటుంబానికి శనివారం గని మేనేజర్ అల్లావుద్దీన్ చేతుల మీదుగా మ్యాచింగ్ గ్రాంట్ చెక్కు అందజేశారు.

బాధిత కుటుంబానికి భరోసా

మందమర్రిరూరల్: పట్టణంలోని రెండో జోన్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ రాధాకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎంపీ వివేక్ శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్వో ప్లాంట్ పరిశీలన

చెన్నూర్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలలో చెడిపోయిన ఆర్వో ప్లాంట్‌ను శనివారం మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి పరిశీలించారు. చెన్నూర్ పర్యటన సందర్భంగా పాఠశాలలో శుద్ధ జలప్లాంట్ చెడిపోవడంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని వివేక్ దృష్టికి తీసుకురాగా ప్లాంట్‌ను పరిశీలించినట్లు తెలిపారు. సొంత ఖర్చులతో మరమ్మతు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వినతిపత్రం అందజేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు విద్యారంగ సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరుతూ శనివారం తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, స్కావెంజర్లను విధుల్లోకి తీసుకోవాలని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు.

విద్యార్థులకు క్విజ్

మంచిర్యాలఅర్బన్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులకు గులాబీ పూలు అందజేసి స్వాగతం పలికారు. పాఠశాల ప్రగతి, విద్యార్థుల హాజరు, ఉత్తమ ఫలితాల సాధన, మధ్యాహ్న భోజన నిర్వహణ, మనఊరు-మనబడి తదితర విషయాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుండేటి యోగేశ్వర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.